ప్రకృతి వైపు.. రైతుల చూపు

- ప్రకృతి సాగుపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది
- ప్రకృతి వ్యవసాయ దిగుబడులతో వ్యాధులు దూరం
- ఖర్చు తక్కువ.. ఫలితం ఎక్కువ



వెల్లటూరులో ప్రకృతి సాగు రైతులతో మాట్లాడుతున్న జేమ్స్ జాకబ్, బాపట్ల డీపీఎం వాణిశ్రీ, పక్కన సిబ్బంది (ఫైల్)

భట్టిప్రోలు: రసాయన అవశేషాలు లేని ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. రైతు సాధికారత సంస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఆయా మండలాల్లోని గ్రామాల్లో క్లస్టర్ రీసోర్స్ పర్సన్‌ను నియమించారు. గ్రామాల్లోని రైతుల వివరాలు సేకరించి ఎస్‌హెచ్‌జీల ద్వారా అవగాహన కల్పించి రసాయన ఎరువులు, పురుగు మందులు లేని వ్యవసాయాన్ని ముందుకు తీసుకు వెళుతుంది. ప్రకృతిలో సహజంగా లభించే పశు వ్యర్థాలు, ఆకులు, పేడ, మూత్రంలాంటి వాటితో సొంతంగా తయారు చేసుకునే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. బాపట్ల జిల్లాపరిధిలోని 25 మండలాల్లో వరి, శనగ, మొక్కజొన్న, మామిడి, పండ్లు, కూరగాయలు, వరి, మినుములు, పెసర, మెట్ట పంటలు 173 గ్రామాల్లోని 362 గ్రామైఖ్య సంఘాల్లో ప్రకృతి వ్యవసాయం అమలవుతుంది. బాపట్ల జిల్లాలో 60 వేల ఎకరాల్లో 43 వేల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. గ్రామాల్లోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై డీపీఎం వి.వాణిశ్రీ నేతృత్వంలో ఎన్‌ఎఫ్‌ఎలు, మాస్టర్ ట్రైనీలు ఆయా మండలాల్లోని గ్రామాలలో ఐసీఆర్పీల ద్వారా సలహాలు సూచనలు అందిస్తున్నారు.

జీవన ఎరువుల తయారీ విధానం..

- ప్రకృతి వ్యవసాయంలో పూర్తిగా జీవన ఎరువులు వినియోగిస్తారు. ఘన జీవామృతాన్ని ఆవు పేడ, ఆవు మూత్రం, బెల్లం, శనగపిండి, పుట్ట మట్టితో కలిపి తయారు చేస్తారు. ఎకరాకు 400 కిలోలు కావాలి.
- ద్రవ జీవామృతాన్ని ఆవు మూత్రం, పేడ, పప్పు దినుసులు, పిండి, నీరు, బెల్లం, పుట్ట మట్టితో తయారు చేస్తారు. ఎకరాకు 200 లీటరుల కావాలి.
- కషాయం తయారీని పంటలకు వచ్చే వ్యాధులను బట్టి తయారు చేయడం జరుగుతుంది. దీనిలో అగ్నిహస్త్రం, దశ పరిణి, వేప కషాయం, నియమాస్త్రం, అల్లం, వెల్లులి, దేశవాళీ ఆవు నుంచి తీసిన పుల్లటి మజ్జిగతో కలిపి తయారు చేస్తారు.

ఆజోల్లా ఉపయోగాలు...

వరిలో ఆజోల్లా వేయడం వల్ల కలుపు ఆశించదు. దోమ పోటు తగ్గుతుంది. యూరియా చేసే పని ఇది చేస్తుది. గాలిలో నత్రజని తీసుకుని మొక్కకు అందిస్తుంది. పశువుల మేత, గొర్రెలు, మేకలు, కోళ్లకు దాణాగా ఉపయోగపడుతుంది.



పెరటిలో ఏపుగా పెరిగిన బీరకాయలు

బహిరంగ మార్కెట్‌లో డిమాండ్...



వరి పండించే ప్రకృతి వ్యవసాయ రైతులు ధాన్యాన్ని అమ్మకుండా సొంతంగా బియ్యం పట్టించి మార్కెటింగ్ చేసుకుని అధిక ఆదాయం పొందుతున్నారు. అలాగే గ్రామాల్లో నాటు వరి విత్తనాలను కూడా రైతులు ఈ పద్ధతిలో సాగు చేస్తున్నారు. రత్నచోళి, నవారాలాంటి రకాలు రసాయన పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా కషాయాలు తయారు చేసి రైతులు వినియోగించడానికి ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నారు. ఘన జీవామృతం, సప్త ధాన్యాంకురంతో తయారు చేసి పంటలను ఏపుగా పెంచుతున్నారు. ఇవి పంటల పెరుగుదలకు, గింజ నాణ్యంగా రూపొందడానికి ఉపకరిస్తాయి. ఈ నేపథ్యంలో రైతులు ప్రకృతి వ్యసాయాన్ని ఆచరించి భూసారాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

రైతులను ప్రకృతిసాగు వైపు మళ్లిస్తున్నాం..



రెతులు రసాయనిక వ్యవసాయం నుంచి ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేందుకు కృషి చేస్తున్నాం. ఈ వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చు. ప్రస్తుతం 365 రోజుల కిచెన్ గార్డెన్, ఏటీఎం (తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ ఆదాయం వచ్చే విధానం), ఎ గ్రేడ్ మోడల్స్ విధానాలను ప్రోత్సహిస్తున్నాం.

– వి.వాణిశ్రీ, ప్రకృతి వ్యవసాయం బాపట్ల డీపీఎం

దిగుబడి క్రమేణా పెరుగుతుంది..

14 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. నాకున్న 1.30 ఎకరాలలో వరి సాగు చేస్తున్నాను. మొదట్లో దిగుబడి కొంత మేర తగ్గింది. రాను రాను దిగుబడి పెరగ సాగింది. రసాయన, పురుగు మందులు వాడిన పంట పొలాలతో సమానంగా 35 బస్తాల దాకా పండిస్తున్నాను.

–పి. సూరిబాబు, రైతు, కోనేటిపురం

క్లుప్తంగా

గోగులమ్మకు ప్రత్యేక పూజలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామదేవత గోగులమ్మ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని సహస్ర దీపాలంకరణ సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు దీవి గోపి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

రాజరాజ నరేంద్రునికి నిత్య కల్యాణం



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో కొలువైన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి వారికి కార్తిక మాసం పురస్కరించుకుని నిత్య కల్యాణం నిర్వహిస్తున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు చేస్తున్నట్లు అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ తెలిపారు. ప్రతి నిత్యం తెల్లవారుజామున ఏకాదశ రుద్రాభిషేకం, నవ హారతులు, సాయంత్రం నిర్వహించిన శాంతి కల్యాణంలో కె.అనిల్‌కుమార్ దంపతులు పాల్గొన్నారు. ప్రతి సోమవారం పౌర్ణమి పర్వదినాల్లో ఉదయం పూట ప్రత్యేకంగా కల్యాణం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు పర్యవేక్షించారు.

11న కలెక్టరేట్ ముట్టడి



కర్లపాలెం: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముట్టడించనున్నామని ఏఐటీయూసీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా చెప్పారు. కర్లపాలెం ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం కరపత్రాలను ఆవిష్కరించారు. కరిముల్లా మాట్లాడుతూ ఇసుక ర్యాంపులను ప్రైవేటు యాజమాన్యాలకు ఇవ్వకుండా ప్రభుత్వమే నిర్వహించాలని చెప్పారు. గృహాలు నిర్మించుకునే వారందరికీ సక్రమంగా ఇసుక అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులు పఠాన్ జలీల్‌ఖాన్, శవనం కోటిరెడ్డి, ఎస్.సమద్, ఎస్.కాశిం తదితరులు ఉన్నారు.

పోలీసు స్టేషనులో రికార్డుల తనిఖీ



అమర్తలూరు(వేమూరు): పోలీసు స్టేషనులో పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని రేపల్లి డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు పేర్కొన్నారు. అమర్తలూరు పోలీస్ స్టేషన్‌లో బుధవారం రికార్డులు తనిఖీ చేశారు. అయన మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్‌ను తనిఖీ చేయడం జరిగిందన్నారు. అనంతరం స్టేషన్ వద్ద మొక్క నాటారు. చుండూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ జానకి అమర్‌వర్ధన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాతత్పరత కలిగి ఉండాలి



రేపల్లె రూరల్: బాల్యం నుంచే ప్రతి ఒక్కరూ సేవాతత్పరతను కలిగి సమాజ సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని డాక్టర్ వసంతం వీరరాఘవయ్య అన్నారు. ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో బుధవారం పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వీరరాఘవయ్య మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో పాల్గొనటంతో విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, సేవాదృక్పథం అలవడతాయని చెప్పారు. తోటివారికి సాయం చేయటమే దేవునికి చేసే సేవని, ఆపదలో ఉన్న వారికి, పేదలకు చేయూతనివ్వాలని చెప్పారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.దాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

డీడీఏ విజయ నిర్మల



సమ్మెటవారిపాలెంలో రైతులతో మాట్లాడుతున్న డీడీఏ విజయనిర్మల

కర్లపాలెం: ఖరీఫ్ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించటం వలన తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ డెప్యూటీ డైరెక్టర్ ఎం.విజయనిర్మళ చెప్పారు. బుధవారం ఏఓ సుమంత్‌కుమార్ ఆధ్వర్యంలో పెదగొల్లపాలెం, సమ్మెటవారిపాలెం గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో డీడీఏ విజయనిర్మల, ఏడీఏ లక్ష్మి పాల్గొన్నారు. డీడీఏ విజయనిర్మల మాట్లాడుతూ పైర్లకు ఆశించే చీడపీడల నివారణకు వ్యవసాయాధికారులు సూచించే మందులు తగిన మోతాదులో మాత్రమే వేయటం వలన పైరుకు మేలు జరుగుతుందని చెప్పారు. ఏడీఏ ఎ.లక్ష్మి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం కో–ఆర్డినేటర్ సత్యనారాయణ, వ్యవసాయ విస్తరణాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రేపల్లె రూరల్: రైతులు నిరంతరం తమ సాగుభూమిలోని వరిపైరును పరిశీలిస్తు ఉండాలని, ఏ మాత్రం అజాగ్రత్త వహించినా మూల్యం చెల్లించుకోకతప్పదని మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయ్‌బాబు సూచించారు. మండలంలోని పేటేరు–1, 2 గ్రామాలలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వరికంకులు ఏర్పడి ఈనెపాలు పోసుకునే దశలో ఉంటాయన్నారు. ఈ దశలో వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు మాత్రమే సాగుభూమిలో మందులు వినియోగించాలన్నారు. వీఏఏ సుష్మ, రైతులు పాల్గొన్నారు.

అమర్తలూరు(వేమూరు): వరి పైరులో పాము పొడ తెగులు, అగ్గి తెగులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఉయ్యూరి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా తెగుళ్ల నివారణపై రైతులకు వ్యవసాయ అధికారి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను అక్షరాస్యులను చేయాలి

కర్లపాలెం: నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులను చేయాలని ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అడల్ట్ ఎడ్యుకేషన్ వలంటీర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి హాజరైన ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలలో ఉన్న చదవడం, రాయడం రాని మహిళలకు ఉల్లాస్ కార్యక్రమం ద్వారా చదువు చెప్పేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. పది మంది నిరక్షరాస్యులైన మహిళలకు ఒక మహిళా వలంటీర్‌ను ఏర్పాటు చేసి చదవడం, రాయడం నేర్పిస్తారని చెప్పారు. ఎస్ఐ ఎ.రవీంద్ర మాట్లాడుతూ మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని చెప్పారు. జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మండల సమైఖ్య అధ్యక్షుడు ధనలక్ష్మి, తహసీల్దార్ సుందరమ్మ, ఏపీఎం శ్రీనివాసులు రెడ్డి, సీసీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పొన్నెకల్లు(తాడికొండ): సైబర్ క్రైమ్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా అడ్డుకట్ట వేయవచ్చని తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. తాడికొండ మండలం పొన్నెకల్లు బొడ్డు రాయి సెంటర్‌లో సైబర్ క్రైమ్ నేరాలపై నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇటీవల కాలంలో సైబర్ క్రైమ్ నేరాలు పెరిగాయని, గ్రామీణ ప్రాంతాలలో వీటిపై పెద్దగా అవగాహన లేని కారణంగా ప్రజలు మోసాలకు గురై ఆన్‌లైన్‌లో నగదును పోగొట్టుకొని బాధితులవుతున్నారన్నారు. ప్రధానంగా ఏటీఎం పిన్, ఓటీపీ నంబర్‌లను ఎవరైనా ఫోన్ చేసి అడిగితే అసలు చెప్పకూడదన్నారు. ఏటీఎంల వద్ద తెలిసిన వారి సహాయం తప్ప గుర్తు తెలియని వ్యక్తుల సహాయం కోరడం వంటివి మోసాలకు దారితీస్తాయన్నారు. అపరిచిత వ్యక్తులు బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి కొన్ని వివరాలు కావాలని అడుగుతారని, వారికి వివరాలు చెప్పవద్దన్నారు. ఊళ్లకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం అందించి భద్రతను పెంచుకోవడం వంటి అంశాలపై వీడియోలను ప్రదర్శించడంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పాత రత్నాటాకీస్ నుంచి శివాజీ బొమ్మ సెంటర్ వరకు నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని పలు రోడ్లు, కాల్వలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. 130 మీటర్ల ఎక్స్‌టెన్షన్ సీసీ రోడ్డును రూ.20.5లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కమిషనర్ బండి శేషన్న, ఇన్‌ఛార్జి ఎంఈ ఎ.శ్రీనివాసరావు, ఎఈ సూరిబాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీమన్నారాయణ, టీపీవో సాంబశివరావు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలు లేకుండా చూడండి...

తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. పట్టణంలోని 5,6 వార్డులలో బుధవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. అలాగే పూడికతీత పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు పారుదల జరిగే విధంగా చూడాలన్నారు. వ్యర్థాల నిర్వహణపై ప్రజలు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అందరూ సమన్వయంతో పనిచేస్తే సమస్యను అధిగమించవచ్చన్నారు. ఆమె వెంట కౌన్సిలర్లు తోట రఘురామ్, కొత్రపాటి లక్ష్మి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏఈ సూరిబాబు, తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్య పరిష్కారం అయ్యేవరకు ఆందోళన



ధర్నా చేస్తున్న కార్మికులు

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిలు వచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తారని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల యూనియన్ నాయకులు కూరపాటి స్టీఫెన్ స్పష్టం చేశారు. బుధవారం దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అఖిల పక్ష ట్రేడ్ యూనియన్ నాయకులతో పాటు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చాయని, కార్మికులు తమ కష్టార్జితాన్ని తమకు ఇమ్మని మాత్రమే అడుగుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటే ఒక్క రోజులో సమస్య పరిష్కారం అవుతుందని, నియోజకవర్గ ఎమ్మెల్యే నారా లోకేష్ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఆర్ ఇస్రాయిల్, విజయం పిల్లే, ఎం.ఆశీర్వాదం, గురవయ్య, వై.సాంబయ్య, రమాదేవి, కె.జి.కృష్ణ, ఎం .కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఐలవరం విద్యార్థి



ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం జెడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి వి.చైతన్య కుమార్ అండర్–14 కబడ్డీ విభాగంలో బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఏ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న కోచింగ్ క్యాంప్‌లో శిక్షణ పొందుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 8 నుంచి 10 వతేదీ వరకు జరగనున్న పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రతిభ చూపిన చైతన్య కుమార్‌ను, శిక్షణ ఇచ్చిన శ్రీనివాసరెడ్డిని హెచ్ఎం ఎం .మోహన్‌రావు, ఉపాధ్యాయుడు బదరీనాథ్‌లు అభినందించారు.

రీసర్వేకు సహకరించండి

రేపల్లె రూరల్: ఏపీ అర్బన్ రీసర్వే పథకంలో భాగంగా పట్టణ పరిధిలో రీసర్వే కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేలో దస్తావేజులు, ఇతర రికార్డుల పత్రాలు సిబ్బందికి చూపించి సర్వేను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

అన్నిగ్రామాలకు 'ఉపాధి' కల్పించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కొల్లూరు(వేమూరు): లంక గ్రామాల ప్రజలందరికీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం కొల్లూరు మండల అధ్యక్షుడు బొనిగల సుబ్బారావు తెలిపారు. బుధవారం కొల్లూరు మండలం ఆవులవారిపాలెంలో ఉపాధి హామీ కూలీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కృష్ణా నదికి వరదలు నేపథ్యంలో కొల్లూరు మండలంలోని లంక గ్రామాల ప్రజలకు చేయడానికి పని, తినటానికి తిండి దొరకని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఈ పరిస్థితిల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక మార్లు గ్రీవెన్స్‌లో ఎంపీడీఓ, తహసీల్దార్‌లను కలిసి పని కల్పించాలని వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. కొల్లూరు మండలంలోని 12 లంక గ్రామాలకు గాను కేవలం రెండు లంక గ్రామాలకు మాత్రమే ఉపాధి పనులు కల్పించడం జరిగిందన్నారు. మిగిలిన గ్రామాలకు కూడా పని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి కూలీకు రోజుకు రూ.600 ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇస్సాకు, మధు, ఆవులవారి పాలెం ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రాష్ట్ర మల్లఖంబ్ పోటీలకు తెనాలి విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

తెనాలి: కర్లపాలెం మండలం చింతాయపాలెంలో మంగళవారం జరిగిన మల్లఖంబ్ పోటీల్లో స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు అద్భుత ప్రతిభను ప్రదర్శించారు. తమ విద్యార్థులు ఆరుగురు 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి మల్లఖంబ్ పోటీలకు అర్హత సాధించారని హైస్కూలు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చిలకా సుందరరావు చెప్పారు. అండర్–19 బాలికల విభాగంలో షేక్ సుహానా (9వ తరగతి), బాలుర విభాగంలో కె.శివయ్య (9వ తరగతి), అండర్–17 బాలికల విభాగంలో వర్షిత ప్రియ (9వ తరగతి), బాలుర విభాగంలో బాణావత్ ఇంద్ర నాయక్ (9వ తరగతి), అండర్–14 బాలికల విభాగంలో పావని శ్రీవిద్య (ఆరవ తరగతి), బాలుర విభాగంలో దమ్ము నాగచైతన్య (8వ తరగతి) ఎంపికైనట్టు తెలిపారు. ఈనెల 9న జరగనున్న రాష్ట్రస్థాయి మల్లఖంబ్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు టి.ప్రసాద కుమారి, కొడాలి గోవర్ధన తెలియజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

ఏడీఏ సునీత



రైతులకు సూచనలిస్తున్న డీఆర్‌సీ ఏడీఏ సునీత

తెనాలిరూరల్: తక్కువ ఖర్చుతో అధిక దిగుబులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సునీత తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తెనాలి మండలం ఖాజీపేట, హాఫ్‌పేట గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు బుధవారం పర్యటించారు. పొలాలను పరిశీలించి గ్రామ సభలు నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్, జీవ ఎరువులు వాడాలని సూచించారు. రైతులందరూ ఈకేవైసీఈ నమోదు చేయించుకుని, ఈ–పంటలో వివరాలను నమోదు చేయించుకోవాలని చెప్పారు. లాంఫాం ప్రధాన శాస్త్రవేత్త రత్నం మాట్లాడుతూ ఘన జీవామృతం, ద్రవ జీవామృతంల గురించి వివరించారు. క్షేత్ర సందర్శనకు వెళ్లి పొలాలను పరిశీలించగా చీడపీడలు, నాము తెగులును గుర్తించి నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. వరిలో వచ్చే దోమ పోటుకు పైమెట్రోజైన్ 0.6 గ్రాములు, ట్రిఫ్లూమిజోపైరిన్ 0.486 ఎంఎల్, డైనోటిఫ్యురాన్‌లలో ఏదైనా వాడవచ్చని సూచించారు. ఎండల నుంచి రక్షణ కోసం లీటరు నీటిలో నాలుగు గ్రాముల గంథకాన్ని కలిపి పిచికారీ చేయాలన్నారు. మండల వ్యవసాయ శాఖాధికారి జి.ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ ఆకు నల్లి తెగులు నివారణకు నీటిలో కరిగే గంథకం పొడి లేదా కైకోఫాల్ 5ఎంఎల్, కానీ స్పైరోమెసిఫిన్ 1ఎంఎల్‌లలో ఏదైనా వాడవచ్చని తెలిపారు. వరి ఆకుల మీద, వెన్ను మెడ భాగాల మీద, ఆకులపై నూలు కండె ఆకారం కలిగిన గోధుమ రంగు అంచులు గల మచ్చలు కనబడితే ట్రై సైక్లోజోల్‌ను వినియోగించాలన్నారు. వీఏఏలు, వ్యవసాయాధికారులు రైతులు పాల్గొన్నారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరించండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మిపతి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఏసీ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే ప్రజలతో ఉద్యోగులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మిపతి సూచించారు.14,15 వార్డులలో బుధవారం పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంకు వచ్చిన ప్రతి అర్జీని నమోదు చేసి వెంటనే పరిష్కరించే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పశువులతో సమస్య



స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా గల మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్‌కు పడమరవైపు రహదారి చిత్రమిది. వాహనాలు, ఆవులతో రోడ్డు రాకపోకలకు అవకాశం లేకుండా తయారైంది. అక్కడ ఒకవైపు చేపల దుకాణాలు నడుస్తుంటాయి. మరోవైపు అనుబంధ అమ్మకాలు జరుగుతుంటాయి. ఈ కారణంగా రహదారి కుంచించుకుపోయింది. అన్న క్యాంటీన్ పక్క నుంచి ఈ రోడ్డులోకి వెళ్లేందుకు ర్యాంపు నిర్మించారు. అటు నుంచి వెళ్లేందుకు వాహనాలు, నిత్యం సంచరిస్తుండే ఆవులు, పందులతో దుర్భేద్యంగా తయారైంది. మరోవైపు దుర్గంధంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగానే కనిపిస్తున్న ఈ సమస్యను పరిష్కరించకపోతే ఎలాగని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

- తెనాలి